సంపుటి :02 సంచిక :135 పేజీలు :04

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people


గురువారం 17, జూలై 2025




## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఓరుగల్లు సత్తా

జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు.. రాష్ట్రంలో అగ్రస్థానం

04





## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దంపతులు

నాలుగు దశాబ్దాల సాయుధ పోరాటానికి స్వస్తి..

జనజీవన స్రవంతిలోకి గద్దర్ సమకాలికుడు

02

మావోయిస్టు పార్టీలో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్న అగ్రనేత, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటేరియట్ సభ్యుడు మాల సంజీవ్ అలియాస్ అశోక్ అలియాస్ లెంగు దాదా (62), ఆయన భార్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పెరుగుల పార్వతి అలియాస్ దీనా (52) జనజీవన స్రవంతిలో కలిశారు. గురువారం వారు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఎదుట లొంగిపోయారు. విప్లవ గాయకుడు గద్దర్‌కు సమకాలికుడైన సంజీవ్ లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

- హైదరాబాద్, అక్షరదర్బార్



## ప్రాదేశిక పోరుకు సై!

### పంచాయతీ ఎన్నికల కంటే 'ప్రాదేశికం' వైపే సర్కార్ మొగ్గు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసి, కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా 566 జడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ బుధవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలన్న హైకోర్టు ఆదేశాలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ ఉత్తర్వులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వ తాజా చర్యతో ఎన్నికల నగారా అధికారికంగా మోగినట్లయింది. దీంతో క్షేత్రస్థాయిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కి, గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

04

- మండల, జిల్లా ప్రాదేశిక స్థానాలు ఖరారు
- త్వరలో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- గ్రామాల్లో రాజుకున్న రాజకీయ వేడి
- పదవులు దక్కించుకునే పనిలో ఆశావహులు
- ఎమ్మెల్యేలు, పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం

## కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం



- వారి కుటుంబంలో అంతర్గత కుమ్ములాట
- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ముందు అసెంబ్లీకి రావాలి..
- కేసీఆర్ ప్రభుత్వానికి సూచనలిస్తే తీసుకుంటాం..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్

04



## మహిళల భద్రతకే షీ టీమ్స్

02

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ఉద్యోగుల బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలు ఎత్తి సందడి చేశారు. గ్రామదేవతలకు మొక్కులు సమర్పించారు. పురుష ఉద్యోగులు నెత్తిపై పాగాలు ధరించి తెలంగాణ గ్రామ దేవతల పాటలకు డాన్స్ చేస్తూ సందడి చేశారు.



# స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపికైన విద్యార్థులు

అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర క్రీడ పాఠశాలకు ఎంపికయ్యారు. ఈనెల 1నుండి 8వరకు హైదరాబాదులోని హకీంపేట్ క్రీడా పాఠశాల ఆవరణలో జరిగిన ఎంపిక పోటీలలో జిల్లా నుండి ముగ్గురు విద్యార్థినీలు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగవ తరగతి లో తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. ఎంపికైన వారిలో కోల శాన్వి, గంట హరిచందన, నాగుల తులసి అనే ముగ్గురు చిన్నారులు కాళేశ్వర




గ్రామం నుండి ఎంపికయ్యారు. ముగ్గురిలో ఇద్దరు చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చిన్నారులకు అభినందనలు తేలిపారు . రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతమైన కాళేశ్వరం నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపిక అవ్వడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. దీనితోపాటు స్థానికంగా కూడా గ్రామస్తుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నారు.

# పరకాలలో ఇందిరా మహిళ శక్తి సంబరాలు.



అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణ కేంద్రంలోని వేల్లంపల్లి రోడ్ లో గురువారం మహాదేవ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన పరకాల నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్ లు స్నేహ శబరిష్, డాక్టర్ సత్య శారద లతో కలిసి వడ్డీ లేని రుణాలు, బీమా చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహిళల అభివృద్ధికి సోలార్ ప్లాంట్లు, ఉచిత బస్సులు ప్రయాణం, పెట్రోల్ బంకులు, శక్తి క్యాంటీన్లు, బజార్లు, స్కూల్ యూనిఫాం స్టిచింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రాల వంటి అంశాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం సమాజం ఆనందంగా ఉంటుందన్నారు.



# యూరియా కోసం క్యూలో చెప్పులు

-

రోజుల తరబడి పడిగాపులు

మాదారం పీఏసీఎస్ గోదాం వద్ద ఇదీ పరిస్థితి

అక్షరదర్బార్, పరకాల : ఊహించినట్లే జరుగుతుంది. ఈ ఏడాది యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. రోజురోజుకి యూరియా కొరత తీవ్రమవుతుండటం అన్నదాతను కలవరపరుస్తుంది. యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. వ్యవసాయ పనులను వదులుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ల చుట్టు తిరగాల్సి వస్తుంది. చివరకు పీఏసీఎస్ లు వద్ద క్యూలో నిల్చోలేక చెప్పులను వరుసలో పెడుతున్నారు. గురువారం పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని మాదారం పీఏసీఎస్ యూరియా కోసం రైతులు చెప్పులను క్యూలో పెట్టి నిరీక్షించటం కనబడింది. మహిళలు సహా రైతులు ఎండలో నిలబడలేక తమ చెప్పులను క్యూలో పెట్టి వేచి ఉన్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇస్తున్న యూరియా కోసం రోజుల తరబడి పీఏసీఎస్ గోదాం చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు వాపోయారు. నాలుగు రోజుల క్రితం వచ్చి పొద్దంతా ఉన్నా యూరియా దొరకలేదని, మళ్లీ ఇవాళ వచ్చామని ఇక్కడ కొందరు మహిళా రైతులు చెప్పారు. వరి నాట్లు వేయటం కూడా మొదలవుతున్నందున ప్రభుత్వం దృష్టి సారించి యూరియా కొరతను తీర్చాల్సిన అవసరం ఉంది.



# పూర్వ విద్యార్థికి ఘన సన్మానం

అక్షరదర్బార్, వెంకటాపురం(నూగూరు): మండల కేంద్రానికి చెందిన బచ్చు పూర్ణచంద్రరావు (సత్యదేవ మెడికల్స్) కొడుకు రాహుల్ గౌతమ్ సీఏ చార్టర్ అకౌంట్స్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం పట్ల విజన్ స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పాఠశాల పూర్వ విద్యార్థి అయిన సీఏ బచ్చు రాహుల్ గౌతమ్ ను వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావును ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అత్యంత క్లిష్టమైన సీఏ చార్టర్ అకౌంట్ పరీక్షలో మన్యం నుంచి మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించి, మన్యానికే వెలుగు తెచ్చాడని, రాహుల్ ని చూసి ఇంకా చాలామంది ఇన్స్పిరేషన్ పొందాలని, ఇండియాలోనే సివిల్స్ తర్వాత అత్యంత కఠినమైన సీఏ ఫైనల్స్ ఎగ్జామ్స్ లో మొదటిసారి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించినందుకు ఈ సందర్భంగా రాహుల్ ను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాహు బాలేంద్రుని రామారావు, రాహుల్ తల్లిదండ్రులు బచ్చు పూర్ణచంద్రరావు- ప్రియాంక, బాబాయ్ రవిచందర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల భద్రతకే షీ టీమ్స్

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, నర్సంపేట: నర్సంపేట డివిజన్ పరిధిలోని మహిళలు, విధ్యార్థునులకు భద్రతపై భరోసా కల్పించడంలో భాగంగా నర్సంపేటలో షీ టీం ఏర్పాటు చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. నర్సంపేట డివిజన్ పరిధిలో మహిళల భద్రత కోసం నర్సంపేట పట్టణ కేంద్రంలోని పోలీస్ సిబ్బంది నివాస సముదాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన షీ టీం కార్యాలయాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. నర్సంపేట షీ టీం విభాగం తొలి ఎస్ఐగా నియమించబడిన స్వాతికి పోలీస్ కమిషనర్ మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సంపేట నూతనంగా ఏర్పాటు చేసిన షీ టీం విభాగం నిర్వహించాల్సినన విధులపై షీ టీం ఏసీపీ సదయ్య పోలీస్ కమిషనర్‌కు వివరించగా, మహిళ, కాలేజీ, పాఠశాల విధ్యార్థునుల భద్రత కోసం షీ టీం తరుపున కాలేజీ విధ్యార్థునులు అకతాయిల నుండి తమకు తాము రక్షించుకొనేందుగాను షీ టీం ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫేన్స్‌లో భాగంగా విద్యార్థునులకు మార్షల్ ఆర్ట్సలో శిక్షణ అందించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ వేగంగా అభివృద్ది చెందుతున్న నర్సంపేట పట్టణంలో పదుల సంఖ్యలో ఉన్నత విద్యకు సంబంధించిన కళాశాలలతో పాటు, చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో వివిధ అవసరాల కోసం నర్సంపేట పట్టణానికి వచ్చి పోయే మహిళలతో పాటు స్థానిక మహిళలు, విద్యార్థునులకు భద్రత కల్పించడం కోసమే నర్సంపేటలో షీ టీం విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం మూడు షీ టీంలు పనిచేస్తున్నాయని. ఎవరైన ఆకతాయిలు మహిళలను వేధించిన, లైంగిక వేధింపులు గురిచేసిన తక్షణమే నర్సంపేట టీం విభాగం ఫోన్ నంబర్ 8712552326 సమాచారం అందించాల్సి వుంటుందని, నర్సంపేటలో ఏర్పాటు చేసినట్లే రాబోవు రోజుల్లో జనగామ జిల్లా కేంద్రంలోను షీ టీంను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అవకాశాన్ని బట్టి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరిన్ని షీ టీం బృందాలను ఎర్పాటు చేయడం జరుగుతుందని సీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, నర్సంపేట, షీ టీం ఏసిపిలు రవీందర్ రెడ్డి, సదయ్య, వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీం ఇన్ స్పెక్టర్ సుజాత, నర్సంపేట ఇన్ స్పెక్టర్ రఘు, దుగ్గొండి సర్కిల్ ఇన్ స్పెక్టర్ సాయిరమణ, నర్సంపేట డివిజన్ ఎస్ఐలు ఇతర పోలీస్‌సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నర్సంపేట డివిజన్ పరిధిలోని నర్సంపేట, దుగ్గొండి, ఖానాపూర్ పోలీస్ స్టేషన్లతో పాటు, నర్సంపేట ఏసీపీ, దుగ్గొండి సర్కిల్ పోలీస్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీపీ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు, స్టేషన్ పనితీరూ, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదయ్యే కేసుల వివరాలతో పాటు, గ్రామాల వివరాలను సంబంధిత స్టేషన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

# మావోయిస్టు దంపతులు సంజీవ్, పార్వతి లొంగుపాటు

- వీరిద్దరూ గద్దర్ సమకాలికులు
- నాలుగు దశాబ్దాలుగా నక్సల్స్ ఉద్యమంలో ప్రయాణం





అక్షరదర్బార్, హైదరాబాద్: మావోయిస్ట్ పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటేరియట్ మెంబర్, గద్దర్ సమకాలికుడు మాల సంజీవ్ అలియాస్ అశోక్ అలియాస్ లెంగు దాదా, అతని భార్య పెరుగుల పార్వతి అలియాస్ దీనా దంపతులు గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఎదుట లొంగిపోయారు. ఈ దంపతులిద్దరూ నాలుగున్నర దశాబ్ధాలపాటు మావోయిస్టు పార్టీలో పని చేసినట్లు సీపీ వెల్లడించారు. సంజీవ్ 1980లో మావోయిస్టు పార్టీకి చెందిన జననాట్య మండలిలో చేరాడు. గద్దర్ నాయకత్వంలో పనిచేసిన సంజీవ్ అనంతర పరిణామాల్లో మణుగూరు దళంలో పనిచేసి, డివిజనల్ కమిటీ సభ్యునిగా ఎదిగాడు. ఆ తర్వాత ఏటూరునాగారం, పాండవ, మహదేవపూర్ దళాల్లో పని చేశాడు. ఆ తర్వాత 2001లో రాష్ట్ర కమిటీ సభ్యునిగా, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోన్ కమిటీ పరిధిలో పని చేశాడు. అనంతరం 2003లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీకి బదిలీ అయ్యాడు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం అయిలాపూర్ అడవుల్లో, తాజాగా బీజాపూర్ అడవుల్లోని నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్ కౌంటర్ల నుంచి తప్పించుకున్నాడు. అదేవిధంగా సంజీవ్ భార్య పెరుగుల పార్వతి అలియాస్ దీనా 1992లో నల్లమల ప్రాంతంలోని పీపుల్స్ వార్ గ్రూపు అప్పర్ ప్లాటూన్ దళంలో చేరారు. ఆ తర్వాత పనగల్ దళంలో పనిచేశాక జననాట్య మండలిలో చేరింది. ఏపీలోని విశాఖ జిల్లా గాలికొండ ఏరియా దళంలో పని చేశాక, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీకి, ఛత్తీస్ గఢ్ కు బదిలీ అయి అక్కడి చైతన్య నాట్య మంచ్ లో చేరింది. మాల సంజీవ్ ను 2007లో వివాహం చేసుకున్న దీనా ప్రస్తుతం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. మాడ్ డివిజన్ లో జరిగిన ఎన్ కౌంటర్ ఘటన నుంచి దీనా తప్పించుకున్నారు. తాజాగా దంపతులు రాచకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మిగిలిన మావోయిస్టులు కూడా జన జీవన స్రవంతిలో కలవాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు.



# రైల్వే జీఎంని కలిసిన నాయిని

- కాజీపేట బస్ స్టాండ్ ఏర్పాటు స్థల ప్రక్రియ వేగవంతం చేయాలని వినతి
- కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ కల్పించాలని కోరిన ఎమ్మెల్యే

అక్షరదర్బార్, కాజీపేట: సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ గా నూతనంగా నియమితులై గురువారం కాజీపేటకు వచ్చిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్ ని కాజీపేట రైల్వే స్టేషన్ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ ఆయన వెంట ఉన్నారు. శాలువాతో సత్కరించి నూతన జీఎంకు ఎమ్మెల్యే నాయిని స్వాగతం పలికారు. హనుమకొండ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కి రోడ్డు మార్గం కాజీపేట మీదుగా ఉన్నదని, కాజీపేటలో బస్ స్టాండ్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలోనే రైల్వే శాఖకు కాజీపేట రైల్వే స్టేడియంలో ఉన్న స్థలాన్ని మంజూరు చేయాలని కోరడం జరిగిందని, బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థల కేటాయింపు ప్రక్రియ సానుకూల దృక్పథంలో వేగవంతం చేయాలని వినతిపత్రం అందజేశారు. కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 50 శాతం ప్రాధాన్యత ఇవ్వాలని, గతంలో ఆగిపోయిన రైళ్లను పునఃప్రారంభించి కాజీపేటలో హోల్డింగ్ కల్పించాలని కోరారు. రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జంట నగరాలుగా ఉన్న ఈ ప్రాంతంలో రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని కోరిన అంశాలపై జీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకుస్, కాంగ్రెస్ నాయకులు మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.







## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

పరకాల, అక్షర దర్బార్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావును ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. సిరంగి సంతోష్ కుమార్, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అన్ని గ్రామాలకు బస్సులు నడపాలి

**డిపో మేనేజర్‌కు బీజేపీ నాయకుల వినతి**

నర్సంపేట, అక్షర దర్బార్: నర్సంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అన్ని గ్రామాలకు బస్సులు నడపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దుగ్గొండి మండలంలోని లక్నేపల్లి, తిమ్మంపేట, గిర్నిబావి, నందిగామ తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యార్థులతో కలిసి నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని చెబుతున్నా, గ్రామాలకు బస్సులే నడపకపోవడం దారుణమన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డేపల్లి నర్సింహరాములు, కట్ల రాంచందర్ రెడ్డి, గడ్డం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారిని ఆశీర్వదించిన రంజిత్ రెడ్డి



అక్షర దర్బార్, నెక్కొండ : నెక్కొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గంధం మహేందర్ కుమార్తె శారీ ఫంక్షన్‌కు పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ‘కారోబార్’కు తప్పని కష్టాలు

- జీవో 51తో ఉనికి కోల్పోతున్న సిబ్బంది..
- రికార్డులు రాసిన చేతులతో పారిశుద్ధ్య పనులు




**అక్షర దర్బార్, కేసముద్రం :** గ్రామ పంచాయతీ వ్యవస్థలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు ప్రభుత్వ మల్టీపర్పస్ విధానంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రికార్డులు రాసి, సిబ్బందితో పనులు చేయించే వారు నేడు స్వయంగా పార పట్టి పారిశుద్ధ్య పనులు చేయాల్సిన దుస్థితికి చేరుకున్నారు. జీవో 51 కారణంగా తమ ఉనికి కోల్పోతున్నామని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి..**

రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో సుమారు 58 వేల మంది సిబ్బంది పనిచేస్తుండగా, వారిలో 4,337 మంది కారోబార్లు, 795 మంది బిల్ కలెక్టర్లు ఉన్నారు. వీరికి నెలకు రూ. 9,500 మాత్రమే వేతనం అందుతుండగా, అది కూడా సకాలంలో రావడం లేదని వాపోతున్నారు. తమను మల్టీపర్పస్ విధానం నుంచి మినహాయించి, పాత పద్ధతినే కొనసాగించాలని, ప్రతినెలా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

**వారి వాదనలు**

‘జీవో 51 సవరించాలి’ - మామిడాల నరసింహులు, తెలంగాణ రాష్ట్ర జాక్ ప్రెసిడెంట్: జీవో 51 నుంచి కారోబార్లు, బిల్ కలెక్టర్లను మినహాయించి పాత విధానాన్ని కొనసాగించాలి. ఏ ప్రభుత్వ శాఖలో లేని ఈ విధానాన్ని పంచాయతీల్లో అమలు చేయడం సరికాదు. సిబ్బందిందరికీ వర్క్ చార్ట్ అందించి, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి.

> **‘పూట గడవడం కష్టం’**
>
> ఏళ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదు. వచ్చే జీతంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. కొత్త సర్పంచులు వచ్చినప్పుడల్లా ఉద్యోగం ఉంటుందో లేదోనన్న భయం వెంటాడుతోంది. ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం నుంచి మినహాయింపు ఇచ్చి, గుర్తింపు కార్డులు అందించాలి.
>
> - కందిపాటి నాగరాజు, తెలంగాణ రాష్ట్ర జాక్ సహ కార్యదర్శి



## అభివృద్ధిపై అబద్ధాలెందుకు?

**మాజీ ఎమ్మెల్యేపై గండ్ర సత్యనారాయణరావు ధ్వజం**

రేగొండ, అక్షర దర్బార్: తన ఉనికిని కాపాడుకోవడానికే మాజీ ఎమ్మెల్యే అభివృద్ధిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండిపడ్డారు. గురువారం రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లో పలు దేవాలయాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాను గెలిచిన 18 నెలల్లోనే గోరి కొత్తపల్లికి రూ.3.20 కోట్లతో ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలు మంజూరు చేయించానని, గత ఎమ్మెల్యే ఎందుకు తేలేకపోయారని ప్రశ్నించారు. నెల రోజుల్లో రేగొండలో రూ.4 కోట్లతో బస్టాండు నిర్మిస్తామన్నారు. రావులపల్లి పోచమ్మ ఆలయానికి రూ.10 లక్షలు, గోరి కొత్తపల్లి బీరన్న ఆలయానికి రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

## మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలి

**డీఎస్పీ సూర్యనారాయణ**

**కొయ్యూరు ఠాణా లో వనమహోత్సవం**

అక్షర దర్బార్, మల్హర్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటికి సంరక్షణ చర్యలు చేపట్టాలని కాటారం డిఎస్పీ సూర్యనారాయణ,సిఐ నాగార్జున రావు లు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా కొయ్యుర్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో 2025 వన మహోత్సవం వంద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడారు మొక్కలు నాటి అటవీ విస్తీర్ణం పెంపుదలకు కృషి చేయాలన్నారు. వన మహోత్సవంలో ప్రజలందరూ పాల్గొని భావితరాల భవిష్యత్తుకు తోడ్పడాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ఉద్యోగుల బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలు ఎత్తి సందడి చేశారు. గ్రామదేవతలకు మొక్కులు సమర్పించారు. పురుష ఉద్యోగులు నెత్తిపై పాగాలు ధరించి తెలంగాణ గ్రామ దేవతల పాటలకు డాన్స్ చేస్తూ సందడి చేశారు.







# 'ప్రాదేశిక' పోరుకు సై!

- మండల, జిల్లా ప్రాదేశిక స్థానాలు ఖరారు
- త్వరలో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- గ్రామాల్లో రాజుకున్న రాజకీయ వేడి
- పదవులు దక్కించుకునే పనిలో ఆశావహులు
- ఎమ్మెల్యేలు, పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం



## పంచాయతీ ఎన్నికల కంటే 'ప్రాదేశికం' వైపే సర్కార్ మొగ్గు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో రాష్ట్రప్రభుత్వం వేగం పెంచింది. తాజాగా మండల ప్రాదేశిక (ఎంపీటీసీ), జిల్లా ప్రాదేశిక (జడ్పీటీసీ) స్థానాలను ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ స్థానాలు, 566 జడ్పీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రకటించింది. ఎంపీటీసీ స్థానాలు 5,773 ఉన్నట్టు పేర్కొన్నది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 12,778 పంచాయతీలు, 1,12,694 వార్డులు ఉన్నట్టు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదంతా చూస్తుంటే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనేది ఖాయమే అనిపిస్తున్నది. ముందు సర్కార్ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు అవగతమవుతున్నది. ఇప్పటికే ఎన్నికలకు అవసరమయ్యే మెటీరియల్ సిద్ధం చేయాలని కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలకు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు సైతం ఇచ్చింది. సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం కూడా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం, పంచాయతీరాజ్ చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్‌ను గవర్నర్ పంపించిన విషయం తెలిసిందే. కాగా, రాష్ట్ర విభజన తర్వాత 2019లోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు 570 ఉండగా, ఎంపీటీసీలు 5,817 ఉన్నాయి. ఇక గ్రామ పంచాయతీలు 12,848 ఉన్నాయి. గతం కంటే ఇప్పుడు ఎంపీపీ, జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలు తగ్గగా, గ్రామ పంచాయతీ స్థానాలు మాత్రం పెరిగాయి. రాష్ట్రప్రభుత్వం ముందు పంచాయతీ ఎన్నికల కంటే, ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నట్లు అధికారిక వర్గాల సమాచారం. ప్రాదేశిక ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు ఉంటాయని సర్వత్రా చర్చ నడుస్తున్నది.

### - ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రాదేశిక స్థానాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల పరిధిలో ఆరు జడ్పీలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాలు, 12 ఎంపీపీ స్థానాలు, 129 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీ, 12 ఎంపీపీ,134 ఎంపీటీసీ స్థానాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో 12 జడ్పీటీసీ, 12 ఎంపీపీ, 109 ఎంపీటీసీ స్థానాలు, మహబూబాబాద్ జిల్లాలో 18 జడ్పీటీసీ, 18 ఎంపీపీ, 193 ఎంపీటీసీ స్థానాలు, ములుగు జిల్లాలో 10 జడ్పీటీసీ, 10 ఎంపీపీ, 83 ఎంపీటీసీ స్థానాలు, వరంగల్ జిల్లాలో 11 జడ్పీటీసీ, 11 ఎంపీపీ, 130 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

### - గ్రామాల్లో ఎన్నికల సందడి..

రాష్ట్రప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాదేశిక స్థానాలను ఖరారు చేయడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రాదేశిక పోరులో సత్తా చాటేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. అన్ని ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఈసారి ఎలాగైనా ఫలానా పదవి తమకే దక్కాలని పైరవీల పావులు కదుపతున్నారు. రిజర్వేషన్లు తేలకపోవడంపై కాస్త ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, అవి ఎలా వచ్చినప్పటికీ వాటికి అనుగుణంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆశావహులు ఇప్పటికే యువత, మహిళలను ఆకట్టుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. యువతను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామ పెద్దలు, పలుకుబడి కలిగిన వ్యక్తులను మచ్చిక చేసుకునే పనిలో పడ్డా రు. తమకు ఈ ఎన్నికల్లో మద్దతిస్తే గ్రామంలోని పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించడంతో పాటు గ్రామానికి అవసరమైన ఆర్థిక వనరులను సమీకరించడంలో అండగా నిలుస్తామని హామీలు గుప్పిస్తున్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఓరుగల్లు సత్తా

### జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు.. రాష్ట్రంలో అగ్రస్థానం

వరంగల్, అక్షరదర్బార్: స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పురస్కారాలలో గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) మరోసారి తన సత్తాను చాటింది. జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించగా, 3-10 లక్షల జనాభా కేటగిరిలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని అన్ని నగరాలతో పోలిస్తే సమగ్రంగా 4వ స్థానాన్ని దక్కించుకుంది. అంతేకాకుండా, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ ఏడాది తొలిసారిగా ప్రవేశపెట్టిన 'గార్బేజ్ ఫ్రీ సిటీ' (GFC) విభాగంలో 'స్టార్ రేటింగ్' కూడా సాధించడం విశేషం.
వరుసగా ఆరోసారి 'ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ' (ఓడీఎఫ్++) నగరంగా గుర్తింపు పొందడం ద్వారా వరంగల్ నగరం స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించడం, కంపోస్టింగ్ తయారీపై అవగాహన కల్పించడం, పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక శిక్షణ, ఐఈసీ ప్రచారాల ద్వారా ప్రజలను భాగస్వాములను చేయడం వంటి చర్యలు ఈ విజయానికి దోహదపడ్డాయి.

### అందరి కృషితోనే ఈ ఘనత: మేయర్ గుండు సుధారాణి

గ్రేటర్ వరంగల్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు దక్కడం పట్ల నగర మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, మురుగునీటి శుద్ధి (STP), మానవ వ్యర్థాల శుద్ధి (FSTP) కేంద్రాల ఏర్పాటు, శాస్త్రీయ పద్ధతిలో సెప్టిక్ ట్యాంకుల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ విజయం అందరి సమష్టి కృషితోనే సాధ్యమైంది," అని అన్నారు. ఈ ఘనత సాధించడానికి సహకరించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందితో పాటు, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములైన ప్రజలందరికీ మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.






# కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం

### వారి కుటుంబంలో అంతర్గత కుమ్ములాట

- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ముందు అసెంబ్లీకి రావాలి..
- కేసీఆర్ ప్రభుత్వానికి సూచనలిస్తే తీసుకుంటాం..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని కోరుతున్నామని, అసెంబ్లీ వేదికగా తనేమైనా సూచనలు ఇస్తే .. స్వీకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కానీ, ఆయన ఫాం హౌస్ దాటి బయటకు రావడం లేదని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో తాను పర్యటిస్తానని వెల్లడించారు. రెండున్నరేళ్లలో తెలంగాణ యువతకు లక్ష ఉద్యోగాలు ఇచ్చితీరుతామని హామీ ఇచ్చారు. బీఆర్ ఎస్ నేతలు తమ హయాంలో అమలు చేసిన పథకాలను పక్కన పెట్టామని, ప్రచారం చేస్తున్నారని.. అది నిజం కాదని సీఎం స్పష్టం చేశారు. బతుకమ్మ చీరెల పంపిణీ, కేసీఆర్ కిట్ తప్ప మిగిలిన పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని తేల్చిచెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనకు లేఖలు రాయడం కాదని.. డెవలప్‌మెంట్, ఆ కుటుంబానికి సొంత వివాదాలతోనే సరిపోతోందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ నాయకత్వాన్ని తన సోదరి, ఎమ్మెల్సీ కవిత ఒప్పుకోవడం లేదని అన్నారు.

**- కేసుల్లో పారదర్శకంగా విచారణ..**

కేంద్రం పిలిచినప్పుడల్లా సీఎం ఢిల్లీకి వెళ్లాలా అని కొందరు మాట్లాడుతున్నారని.. కేంద్రం పిలిచినప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు ఢిల్లీకి వెళ్లాలి అని సీఎం తిరుగు ప్రశ్న వేశారు. లేదంటే నేను కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాలా?అక్కడికి వెళ్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి?హైదరాబాద్‌లో లోకేశ్‌ని కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిశారు? కేదార్ అనే వ్యక్తితో కలిసి కేటీఆర్ దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకున్నారు. డ్రగ్స్ కలగలిపి తీసుకోవడం వల్లే కేదార్ మరణించాడు. ఆయన మరణంపై పూర్తినివేదిక ఉంది అని తెలిపారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మాకు వ్యూహం ఉంది. 50 శాతం రిజర్వేషన్లు వద్దని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో కేసీఆర్ మార్పులు చేశారు. 2014కు ముందు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి కుదించారు. రిజర్వేషన్ల కుదింపును సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. దీనిపై అవగాహన లేకుండా చాలా మంది మాట్లాడుతున్నారు.